

# వారు శ్రీమంతులు!

శ్రీ పంచాగ్నుల శ్రీరాములు.

దాదాపుగా సాయంత్రం కావస్తావుంది. జీవరాసులన్నీ తమతమ నిలయాలకు చేరుకుంటూవున్నాయి. ఇంకా కొంచెం ప్రొద్దున్నాకూడా కారుచీకట్లు క్రమ్మడం మొదలెట్టాయి. గాలి 'భో'రంటూ వీస్తువుంది. కారుమేఘాలు ఢీకొంటూ నిప్పురవల్ని రాలుస్తున్నాయి. గొడ్డుగోదల్ని ఆ గాలివాన దెబ్బ తినకుండ సంరక్షణోపాయం చూచుకోవడంలో స్త్రీపురుషులు స్వగృహాల్లో నిమగ్నులై వున్నారు. 'బిడ్డ, మేక' లేమైనారో నంటూ పొలాల్నుండి, ఫ్యాక్టరీల్నుండి ఆడకూలీలు పరుగెత్తడంచూస్తే ప్రకృతికూడా బీదసాదల్ని పీడిస్తుందేంరా అని పిస్తోంది.

ఏలాగైతేనేం కాస్తోకూస్తో అవకాశం కలుగజేసుకుని యావన్మంది స్వగృహాల్ని చేరుకుంటున్నారు. కాని. పేరికి ఆలాంటి అవకాశం చిక్కలేదు. 'తొందరగా చేదవేం నీళ్ళు, మాదిగముండ నీయమ్మ మొగుడు చేస్తాడనుకున్నావా?-రా తొందరగా' అంటు యజమానురాలు పేరిపైన పిడుగులవర్షం కురిపించింది. పేరికి గుండెల్లో గుద్దినట్లయింది. చేతిలో త్రాడు చేతిలోనేవుంది. శూన్య దృక్కుల్తో యజమానురాలివేపు తిరిగిచూచింది. యజమానురాలి కండ్లల్లోనుంచి అగ్నిజ్వాలలువచ్చి తన్ను కాల్చుకతింటున్నట్లు కనుపించింది. ఇంక ఆవేపు చూడలేకపోయింది. మొగం ప్రక్కకు త్రిప్పుకుని బరబర నాలుగు బారలు చేదేసింది. 'అమ్మ యింక పోయివస్తా' నందిపేరి. 'ఛీ భడవాముండా-మాటిమాటికి పోయివస్తానంటే నీ పొట్టకుపాలి మెలా పోయాలంట? కసువు చిమ్మి ప్రక్కలెయ్యి తరువాత చూద్దాం' అంది యజమానురాలు. సరేనంటూ యింటిల్లపాదికి ప్రక్కలేసి పిల్లల్ని నిద్రబుచ్చింది పేరి 'సరే యిదుగో పోదువుగాని పాపం! మా వారు వచ్చారు. స్నానానికి నీళ్ళుతోడు త్వరగా' నంది యజమానురాలు.

కుంభవర్షం కురియడం మొదలెట్టింది—ఉఱుములు మెఱుపులు గుండెల్ని జారేస్తున్నాయి. గాలికూడా తగ్గలేదు. ఆ సమయంలో-వూరి చివర్న—

తంత్రంగా కప్పిన ఆచుట్టు గుడిసె-(దానికి నడికొప్పున ఆకులు లేవుకూడాను)-దానిపైన వ్యాపించిన బ్రహ్మాండమైన మఱ్ఱికొమ్మ-ప్రక్కన్నే పారే పిల్లకాలువ—ఆ గుడిసెలో—చినిగినచీర వుయ్యాల్లో—నిద్రబోతున్న చంటిబిడ్డను తలచుకునేప్పటికి పేరికి గుండెలు అవిసిపోయాయి. ఏం చేయను?—ఎవరితో చెప్పుకోను?—అథవా చెప్పిన ఆలకించేదెవరు?—బీదవాండ్ల మీద దేముడుకూడా పార్టీకట్టి సాధిస్తూ 'దిక్కులేని వాండ్లకు దేముడే దిక్కు' అను విషయాన్ని రద్దు చేసుకున్నాడా యె!

పొరపాటు-మరిచితిని, పేరికి దిక్కులేక పోలేదు. ఆమెకు భర్త న కోటిగాడే దిక్కు. కాని, వాడు ఆ సమయంలో వూళ్లో లేడు పొరుగూరికి కూలిపనిమీద వుదయమే వెళ్లాడు. రాత్రికి తిరిగి రావలసిన వాడే గాని గాలివాన అడ్డుకుంది.

నిజం చెప్పవలసి వచ్చినప్పుడు యీ విషయం మాత్రం ఒప్పుకోక తప్పదనుకుంటాను. బీదసాదల్లో భార్య భర్తలకు వుండే నిజమైన ప్రేమ- అనురాగం- అన్యోన్య సహాయం- కృతజ్ఞత యితరుల్లో వుందంటారా? వారు సమాన భారం వహించి సంసార శకటాన్ని లాగుతున్నారంటే ఆశ్చర్యం లేదంటాను. అట్లా వున్నా కూడా వాళ్ళు మూర్ఖులు- తెలివిలేని వాళ్ళు- ఇంక ధనం గల వాళ్లో నవనాగరికులు- మేధావులు- రావులు- అండ్లు. ఆ సుఖం- ఆ ఆనందం- ఆ అమాయిక జీవితం వీళ్ళు అనుభవిస్తారంటె కల్ల. అమ్మగారు యెడమొగం పెట్టితే అయ్యగారు పెడమొగం పెట్టుతారు.

'అమ్మా, యింక పోయివస్తా' నంది పేరి—కళ్లెంట వేడి భాష్పాలు రాలుస్తు. 'ఉండు, పోదువుగాని- ఏడుస్తూ చేసినపని యేడ్చినట్లే వుంటుందిలే' అంటు గృహాంతర్భాన్నుండి సింహగర్జన చేసింది యజమానురాలు. ఇంతకు మా ఆయనకు బుద్ధిలేదులే యిటువంటి బొడుగోలు ముండల్ని పనికి పెట్టుకోవడానికి- నిన్నంటే ఏం లాభంలే. ఇంతకు మా ఖర్మ మీలా కాలింది. అదే ఖర్మమో గాని నాచేతి కూడు నాల్గురోజులు తినేప్పటికి గండడు మిండడై కూర్చుంటాడు. ఒద్దఱోయ్ దేముడా రామయ్య గారింట్లో పనిచేసే సుంకిని వుంచుకుందామని నెత్తిని నోరు పెట్టుకోని మొత్తుకుంటే విన్నావు కాదు?' అంటూ రామశాస్త్రివేపు నాలుగు విసరింది. ఈ మాటలన్నీ వినేటప్పటికి పేరికి గుండె నీరు కావడం మొదలెట్టింది. చంటిబిడ్డ- ఆ గుడిసెను తల్చుకుండే సరికి శరీరంలో కంపమెత్త సాగింది. రామ శాస్త్రుర్ల గారింట్లో బొడ్డూడిన ప్పటినుంచి పనిచేస్తుందాయెను. కొట్టో, కసిరో వాళ్ళు పెట్టిన దాన్తోనే పేరి శరీరం పెరిగిందయిపోయె. అటు బిడ్డ, ఇటు కృతజ్ఞత వెనుక నుయ్యి- ముందు గొయ్యి. ఎట్లా ఆలోచించినా యేమీ పాలుపోలేదు.

'అమ్మా, యింటికాడ చంటిబిడ్డ- క్షణంలో పోదాంగదాని విడిసివచ్చా,— లేకుంటే...' అని యేమేమో దగ్గద స్వరంతో చెప్పబోయేసరికల్లా 'వెధవ ముండ, నాకు మాత్రం బిడ్డలు లేరూ. అని నాల్గు చీవాట్లు వేసింది యజమానురాలు. ఆ పెను గాలిలో పేరి అలోచనా మేఘాలు అటుయిటు పారిపోయి శూన్య హృదయం నిలచింది. పేరి యింక మాట్లాడ లేకపోయింది.

ఇంతలోకి రామశాస్త్రుర్లుగారు భోంచేసి శయనించాడు. అక్కడ్నుంచి ఆయనగారికి కాళ్లు పిసుకుతూ కండ్ల వెంబడి జడివాన కురుపిస్తోంది పేరి. అప్పటికి ఝాము ప్రొద్దుపోయి వుండవచ్చు. ఇంతలోకి గాలివాన సర్దుకుంది, మేఘాలన్నీ మాయమై పోయాయి. అది పున్నమ నాటిరాత్రి కావడం వల్ల ఒక్క నెకిలినవ్వు నవ్వాడు చంద్రుడు పేరి కష్టాల్ని చూచి. అమ్మగారు భోంచేసి వచ్చారు. 'అంట్లు ప్రొద్దున తోముదువుగాని పో పాపం,' అంటూ యింతకూడు

పడవేసింది. ఎంత దయా పాపం! ఆ కూడు చెంగులో వేసుకుని వుచ్చు వదిలించుకున్న పిట్టలా- ఆ మోకాటి లోతుపారే నీళ్ళల్లో- రాయి రప్పల్ని లెక్క చేయకుండా పరుగెత్తడం మొదలెట్టింది పేరి. పాపం! బిడ్డ ప్రేమ అలాంటిది కామోసు. ఒక్క గంతులో గుడిసె చేరుకుంది పేరి.

ఆ తొందర్లో గుడిసె పేరికి కనిపించలేదు. నిర్ఘాంతపోయి నిలుచుంది పేరి. కొంత సేపటికి నలు దిక్కులు పరికించిది. ఎక్కడా యేమీ జాడలేదు. త్రోవ తప్పి వచ్చానాయేం అనుకుంది. అలా నిదానంగా పరకాయించేప్పటికి యెడమచేతివేపు ఓ పెద్దమఱ్ఱి కొమ్మపడివుంది. అట్లా దగ్గరికిపోయి చూచును గదా మఱ్ఱికొమ్మ క్రింద చప్పగా అణిగి వూరుకుంది గుడిసె. ఆ దృశ్యం చూచేసరికల్లా పేరి హృదయం భిన్నమై పోయింది. గుడ్లంట రక్తం పడుతూ, వణికే చేతుల్తో మెల్లగా నాల్గు తాటాకులు యిలాగింది. ఏదో చేతికి మెత్తగా తగిలినట్లయింది. ఇట్లా యెత్తే చూచేసరికి నిర్జీవమైన చంటిబిడ్డ. పేరి ప్రాణాలు లేచి పోయాయి తల తిరిగి పోయింది. వికలత్వం చెందింది. బిడ్డను చేత పట్టుకొని మఱ్ఱిచెట్టు దగ్గిరికి పోయింది. చెట్టునుకొని కూర్చుని పాలియ్యడానికి కామోసు-బిడ్డను సందిట్లో వేసుకుంది. ఒక్క వెకిలి నవ్వు నవ్వింది. 'బిడ్డా భయపడ్డావా? ఆకలయిందా? చిన్ని కనకం గదూ' అంటూ బిడ్డ చెంపల్ని కండల్తో సహా కొరికింది.

అంతలోకి తెల్లవారుజాము అయింది. కోటి గాడ్ని వెతకటానా్క అన్నట్టు కలకలారవాల్తో పక్షులు నలువైపులా పోసాగేయి. ఆరాత్రి- ఆ గాలి వానకు బిడ్డా పెండ్లాం యెంత కష్టపడుతున్నారో నంటు రాత్రికి రాత్రే బయల్దేరి కోటిగాడు కప్పర కప్పర చీకటి వుండగానే గుడిసెకు చేరుకున్నాడు. 'పేరి, పేరి' అని యెలుగెత్తి కేకవేస్తూ గుడిసెవైపు నడచాడు. 'ఏం బావోయ్, యింత జాగుచేశావెందుకు, అదుగో, అయ్యో, అంటుబిడ్డను చంకబెట్టుకుని యెదురొచ్చే పేరి మారుపలక లేదు. 'ఏంటబ్బ' అంటూ యిలాచూచే సరికి మఱ్ఱిచెట్టుక్రింద పండుకున్న గుడిసె కనిపించింది. గుండెల్లో అదటు బయల్దేరింది 'ఆ తెలిసిందిలే యింక ఫరవాలేదు నిన్న సందెకాడ రామశాస్తుర్లయ్యగారి యింట్లో పనివుందన్నారుగా ఒకవేళ బిడ్డను యెత్తుకుని అక్కడికిపోయి పనిచేస్తూ గాలివానకు రాలేక అక్కడే వుండారు కామోసు. ఆ రామశాస్తుర్లయ్యగారి కడుపు చల్లంగుండా అనుకుంటూ వూళ్ళోకి వెళ్లుదామని బయల్దేరాడు.

ఇంతలోకి వెలుగు నలువేపులా బాగా వ్యాపించింది. ఇట్లా నాలుగడుగులు వేశాడోలేదో తటాల్న కొయ్య ప్రతిమలా నిలబడిపోయాడు. ఆ నోట్లో కండలు-ఆ మొగంమీద యింకా నాట్యంత్రొక్కే వెకిలినవ్వు- సందెట్లోబిడ్డ—ఆ దృశ్యం చూచేసరికి కోటిగాడికి పంచప్రాణాలు లేచిపోయాయి. మొదలు నఱికిన తాటిమ్రానులా నిలువునా కూలిపోయాడు.

తెల్లవారేప్పటికి యీవార్త ఆవూళ్ళో అంతా ప్రాకిపోయింది. 'వాడి ఖర్మంలే' అన్నవాళ్లేగాని జాలి పడినవాళ్ళుగాని నాల్గు కన్నీటిబొట్లు రాల్చినవారు. గానివేరు. మరుక్షణమే మఱచి పోయారు. పోతే నాల్గు వేడి బొట్లు రాల్చడానికి కవికలం-ఆలకించడానికి పత్రికలు మిగిలి పోయాయి. పరలోకంలో ఆ కష్టజీవులకు శాంతి'-ఆ అమాయకపు జీవితాలకు శాంతి-ఆ పవిత్ర ప్రేమమూర్తులకు శాంతి!